క్లుప్తంగా

ఆలయాల భద్రతకు చర్యలపై హర్షం

పాన్‌గల్: ఆలయాల భద్రతకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు, సెంట్రల్ లాక్స్ అందజేయడంపై అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఆలయాల రక్షణ కోసం చేపట్టిన భద్రత చర్యలను అభినందిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకృష్ణ ఆలయానికి విరాళాలు



కొత్తకోట: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి వనపర్తి జిల్లా రాజనగరం గ్రామానికి చెందిన పట్నం నారాయణ దంపతులు రూ.1,00,116లు, అస్కని అరుణ శ్రీనివాసులు దంపతులు రూ.50,116, వందేమాతరం యోగా టీమ్ సభ్యులు రూ.10,116 ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో జరిగే ఆలయ ప్రారంభోత్సవాలకు భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

అంబాభవాని ఆలయానికి..

కొత్తకోట: అంబ భవాని ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలకు పట్టణానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి రూ.25 వేల విరాళం ఆలయ కమిటీ చైర్మన్ పాగాకు రాఘవేంద్ర ప్రసాద్‌కు అందించారు. అనంతరం కోట్ల ఆంజనేయస్వామి ఆలయ కమిటీని అంబ భవాని ఆలయ కమిటీ సభ్యులు పూజలకు ఆహ్వానించారు.

కొమ్ములగట్టు ఆలయంలో పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమయ్యపల్లి జంట గ్రామాల శివారులో వెలసిన కొమ్ములగట్టు లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి కొమ్ములగట్టు లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆదిత్యారెడ్డికి తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భీంరెడ్డి, నాగేందర్‌సాగర్, రమేష్ గౌడ్, బుచ్చిరెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి

వనపర్తి రూరల్: విద్యార్థుల ఉన్నతి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి యుగంధర్ సూచించారు. మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలకు రోజు హాజరై విధంగా చూడాలని తల్లిదండులకు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్ హెచ్‌ఎం గణేష్‌కుమార్, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, జితేందర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలకు తరలిన నాయకులు



అమరచింత: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 25 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న సీపీఎం రాష్ట్ర మూడో మహాసభలకు మండలం నుంచి సీపీఎం నాయకులు శనివారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, జీఎస్.గోపి, వెంకటేష, అజయ్, బుచ్చన్న, షేక్‌పాషా, సుజ్ఞానం, చంటి, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు ఎంపికైన గ్రామాలివే..

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర వేడుకల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయాలని నిర్ణయించింది. కాగా మొదటిరోజు మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లోనే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సభ నిర్వహించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించనున్నారు. ఇందుకుగాను అధికారులు మండలాల వారీగా గ్రామాలను ఎంపికచేశారు. అమరచింత మండలంలో చింతరెడ్డిపల్లి, ఆత్మకూర్‌లో దేవరపల్లి, చిన్నంబావి, ఖిల్లాఘనపురంలో సల్కెలాపురం, గోపాల్‌పేటలో చెన్నూరు, కొత్తకోటలో రామంతపూర్, మదనాపురంలో దంతనూరు, పాన్‌గల్‌లో మాధవరావుపల్లి, పెబ్బేరులో ఈర్లదిన్నె, పెద్దమందడిలో మంగంపల్లి, రేవల్లి తల్పునూరు, శ్రీరంగాపురంలో నాగసానిపల్లి, వనపర్తిలో అప్పాయిపల్లి, వీపనగండ్లలో సంపత్రావుపల్లి, ఏదుల మండలంలో చీర్కపల్లి ఎంపికయ్యాయి.



ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద మానవహారం చేస్తున్న విద్యార్థులు



అమరచింత తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

సాక్షి, నెట్‌వర్క్: ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు వీధుల్లో ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ముగ్గులు, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

✦ ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు ప్రతిజ్ఞ నిర్వహించారు. అంతకంటే ముందు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, కమిషనర్ శశిధర్, ప్రిన్సిపల్ భాగ్యవర్ధన్‌రెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✦ అమరచింత తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించడంతో పాటు బీఎల్‌ఓలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగ్గులు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి కుమార్, ఎండీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐ గోపాల్, సీఆర్పీ స్వామి తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

✦ పాన్‌గల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓటరు అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐ మహేష్, సిబ్బంది, యువత పాల్గొన్నారు.

✦ వీపనగండ్ల మండల కేంద్రంలో ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, డీటీ కృష్ణమూర్తి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ కురుమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, రాజశేఖర్, యాదయ్య, రవీందర్‌రెడ్డి, విష్ణు, కావలి మహేష్, గోపి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి ఉన్నారు.

✦ వనపర్తి మండలంలోని కదుకుంట్ల పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి చంద్రశేఖర్ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

✦ వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ బి.ఈశ్వరయ్య విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పోతురాజు శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామరాజుయాదవ్, అకాడమిక్ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, పుష్ప, సుష్మ, మన్నెం ఉన్నారు.

✦ ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు, అధికారులు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో కలిసి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్ద మానవహారం ఏర్పాటు చేసి ఎంపీడీఓ వెంకటస్వామి అందరితో ప్రతిజ్ఞ చేయించారు.



ఆత్మకూర్‌లో ముగ్గుల పోటీలు



కదుకుంట్లలో..



వీపనగండ్లలో..

బోనస్ డబ్బులు చెల్లించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులు పండించిన సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని, వరి ధాన్యం విక్రయించి రోజులు గడుస్తున్నా కొందరి రైతులకు మాత్రమే బోనస్ ఇచ్చారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ జి.వామన్‌గౌడ్ ఆరోపించారు. రైతులకు బోనస్ చెల్లించాలంటూ బీఆర్‌ఎస్ నాయకులతో వెళ్లి శనివారం తహసీల్దార్ ఎం వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుంత మౌనిక, చెన్న కేశవరెడ్డి, అయ్యన్న, లక్ష్మణ్ నాయక్, బాలునాయక్, రాములు, గాడిల ప్రశాంత్, యాదగిరి, పసుపుల నెహ్రూ, సతీష్, ప్రశాంత్, అజ్జకొల్లు నర్సింహాగౌడ్, మహేష్, ఎల్లంపల్లి శేఖర్‌రెడ్డి, రాజకుమార్, వహిద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించేలా తల్లిదండ్రులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి డా.పరిమళ, జిల్లా కోఆర్డినేటర్ చంద్రయ్య అన్నారు. శనివారం మండలంలోని గోప్లాపూర్, కిష్టాపూర్‌తండా, కొత్తపేట, జమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ వ్యాధి నిరోధక టీకాల విధానం, చిన్నారుల ఎంసీపీ కార్డులు, రికార్డులను పరిశీలించారు. టీకాల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి చిన్నారికి అందించాలని, విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల జిల్లా కోఆర్డినేటర్ చంద్రయ్య, సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డా.పరిమళ

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎం శివయ్య వితరణగా అందించిన టై, బెల్టులను శనివారం ఎంఈఓ శ్రీనివాసులు అందజేశారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల మాజీ సర్పంచ్ పూర్వ విద్యార్థి అయిన భానుప్రకాష్‌రావు చిట్యాల పడమటి, తూర్పుతండా, చిట్యాల పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం లెక్చరర్‌గా ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థి అయిన ఆంజనేయులును చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ మద్దిలేటి, డీసీబీ కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్‌ఎం శంకర్‌గౌడ్, చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, రాజశేఖర్, బైరోజు చంద్రశేఖర్, మాజీ సర్పంచులు లక్ష్మణ్‌నాయక్, పూల్యానాయక్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ..

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామస్తులు టీవీని అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా పాఠాలు బోధించేందుకు ఇబ్బంది పడుతుండడంతో గమనించిన గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాగాకు రామలింగం రూ.7,500, పాఠశాల ఉపాధ్యాయురాలు అలివేలు రూ.3వేలు, గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు టి. పరమేశ్వర్‌గౌడ్ రూ.2,500, వడ్ల శ్రీనివాసులు రూ.2,500, ఈడిగి లక్ష్మీదేవమ్మ రూ.2వేల మరి కొంతమంది దాతలు విరాళాలు సేకరించి రూ.19,500 విలువ చేసే టీవీ పాఠశాల హెచ్‌ఎం సుభాష్, ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కొత్తకోట రూరల్: వేరు వేరు ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. కొత్తకోట ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలు ఇలా.. వనపర్తి మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన సంద శంకర్ మోపెడ్‌పై భూత్పూర్ మండలం అన్నసాగర్‌కు శనివారం ఉదయం బయలు దేరాడు. కొత్తకోట పట్టణంలోకి వెళ్లేందుకు మదర్ థెరిస్సా జంక్షన్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి మోపెడ్‌ను ఢీకొనడంతో సంద శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో బాధితుడిని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన సంద శంకర్ భార్య సంద లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

మండలంలోని ముమ్మళ్లపల్లికి చెందిన వెంకటయ్య రాయిణిపేట శివారులో వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకుని వరిపంట వేశాడు. ఈనెల 19న పొలం నుంచి మోపెడ్ వాహనంపై వస్తున్న ఆయన గ్రామ సమీపంలో యూటర్న్ తీసుకునే క్రమంలో కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అతివేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీకొట్టడంతో వెంకటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మదనాపురం: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మమ్మ సూచించారు. శనివారం మదనాపురం మండలంలోని తిర్మలాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ గ్రామాల్లో చాలామంది పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త అనిత, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ టీచరు పద్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ



అమరచింత: ఇందిరమ్మ ఇంటితో పాటు కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు కోసం అర్హులు మున్సిపల్ కార్యాలయంతో పాటు ఎంపీడీఓ కార్యాలయాల్లో మరోమారు దరఖాస్తులు అందిస్తున్నారు. ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తు చేసుకున్నా.. గ్రామసభల్లో వెలువరించిన లబ్ధిదారుల జాబితా పేర్లు లేని వారు తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు



అమరచింత/పాన్‌గల్: బడి బయటి విద్యార్థులందరూ బడిలో ఉండాలని సీఆర్పీలు స్వామి, గోవింద్‌నాయక్, భార్గవి, రమాదేవి అన్నారు. బడి బయటి విద్యార్థుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా శనివారం అమరచింత మండలంలోని చంద్రనాయక్‌తండా పంచాయతీ పరిధిలోని తుక్యానాయక్‌తండాలో, పాన్‌గల్ మండలంలోని దావాజీపల్లి, దొండాయిపల్లిలో బడి మానిన విద్యార్థుల సర్వే నిర్వహించారు. బడిమాని మట్టి పనులకు వలస వెళ్తున్న నవీన అనే విద్యార్థిని, తుక్యానాయక్ తండాకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని స్నేహ తల్లిదండ్రులతో మాట్లాడి చదువు ప్రాముఖ్యత వివరించి బడికి పంపేలా ఒప్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి రూరల్: జిల్లాలో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఆర్‌డీఓ ఉమాదేవి పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి డీఆర్‌డీఓ కార్యాలయంలో భారతీయ మహిళా సమాఖ్య 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, మహిళల సంక్షేమం కోసం పలు పథకాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగస్వాములు కావాలన్నారు. మహిళల అణచివేతకు వ్యతిరేకంగా వారి హక్కుల రక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలను గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యవంతులను చేయాలన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి,గీత, వనపర్తి పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు భూమిక, శిరీష, శ్రీదేవి, జ్యోతి, పద్మ, దేవమ్మ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ



మెడికల్ కళాశాల ఆవరణలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డా.సునందిని

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలో శనివారం ప్రభుత్వ మెడికల్ కలాశాల ప్రిన్సిపల్ డాక్టర్.సునందిని కార్మిక సంఘం ఏఐటీయూసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన పనిని బాధ్యతగా చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, నాయకులు వరుణ్, మన్నెమ్మ, సైదాబేగం, నారమ్మ, సుజాత, శోభ, శ్రీగంగ, బక్కయ్య, లక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ డైరీ..

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి టీఎన్‌జీఓ ఉద్యోగుల యూనియన్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక గూటి పక్షులు



మాట్లాడుతున్న పల్లెపాగు ప్రశాంత్

కొత్తకోట: బీఆర్‌ఎస్, బీజేపీలు లోలోపల కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. కొత్తకోట పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నాలుగు రోజులు పాటు జరిగిన ప్రజాపాలన సభలలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అత్యుత్సాహంగా ప్రదర్శించి అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తప్పకుండా అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియ రాష్ట్రంలో నిరంతరం కొనసాగుతుందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వారి బంధువులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించారని దుయ్యబట్టారు. వారు చేసిన తప్పులే కాంగ్రెస్ పార్టీపై రుద్దాలని ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన మండిపడ్డారు.

భవనం కూల్చివేసి..

కొత్తకోట మున్సిపాలిటీకి రూ.లక్షల ఆదాయం వచ్చే భవనాన్ని బీఆర్‌ఎస్ పాలనలో కూల్చివేసి ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అద్దెకు ఉండి మున్సిపాలిటీ ఆదాయాన్ని నాశనం చేస్తున్నారన్నారు. ఈ ఐదేళ్లలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయాన్ని దోచుకున్నారని విమర్శించారు. రోడ్డు విస్తరణ 40 ఫీట్లు అని చెప్పి, వారి ఆస్తులను కాపాడుకునేందుకు కేవలం 25 నుంచి 30 ఫీట్లకు కుదించారని ఆరోపించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, డాక్టర్ పీజే.బాబు, బోయేజ్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, మిషేక్, నరేందర్‌రెడ్డి, ఫయాజ్, సలీం, అంజన్న యాదవ్, పెంటన్నయాదవ్ పాల్గొన్నారు.

రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలి

అమరచింత: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా చెల్లించాలని ఏఐకేఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీఎస్ గోపి డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం సీపీఎం కార్యాలయ ఆవరణంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రైతు భరోసాను రూ.15 వేలు ప్రకారం చెల్లిస్తామని చెప్పి.. నేడు మాట మార్చి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా ఇవ్వాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటేష్, బుచ్చన్న, రాఘవేంద్ర, చంటి, తిరుమలి శ్రీను, కాకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

పదేళ్లుగా పట్టణాభివృద్ధి శూన్యం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్: దినదినాభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రంలో 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పట్టణ అభివృద్ధి ఏమి జరుగలేదని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని 33వార్డులో ఒకే రోజు రూ.43కోట్ల విలువైన పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల వార్డులకే ప్రాధాన్యత ఉండేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. పట్టణంలోని 33 వార్డుల్లో ప్రతి వార్డులోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కరిస్తామని, ప్రజలకు కనీస అవసరాలైన వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లు పెంచితేనే స్థానిక ఎన్నికలు'

పెబ్బేరు రూరల్: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కులగణన చేపట్టిందని, దాని ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. నామినేటెడ్ పదవులు విషయంలో ఉమ్మడి జిల్లా బీసీ నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయి పదవులు దాదాపు 10 మందికి ఇవ్వగా.. అందులో ఒక్క పదవీ కూడా బీసీలకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో వనం తిరుపతయ్యయాదవ్, వీవీ గౌడ్, బత్తుల జితేందర్, మహేందర్, అంజన్న యాదవ్, రమేష్ సాగర్, రాఘవేంద్ర గౌడ్, శివ, రామన్‌గౌడ్, వసంత చారి, గౌతమ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

ఆత్మకూర్: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, అత్యధిక జనాభా కలిగిన బీసీలకు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటా తేల్చాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బీసీ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా రమేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా నాగన్నను నియమిస్తూ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో గంగాధర్, పాండురంగ, నాగేశ్వర్, శంశీర్, నాగరాజు, వంశీ, రఫీఖ్ ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

పెబ్బేరు రూరల్: పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ బహుమతి ప్రదానం చేశారు. అధ్యాపకులు రమేష్, కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్, విద్యార్థినులు కీర్తిశ్రీ, తేజస్విని ని అభినందించారు.